క్లుప్తంగా

వైభవంగా శ్రావణ మాస పూజలు ప్రారంభం



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొమ్మాది : స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో శ్రావణమాసం పూజలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున సుప్రభాత సేవతో ప్రారంభించి శ్రీ లక్ష్మీనారాయణులకు వెండి కవచధారణ చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త సత్యనారాయణమూర్తి, రమాదేవి దంపతులు శ్రీ అష్టలక్ష్మి హోమం నిర్వహించారని ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. అదేవిధంగా శ్రీ వైశాఖేశ్వరస్వామి ఆలయంలో మహాశివునికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు మధుశర్మ తెలిపారు.

మాదక ద్రవ్యాలతో భవిత అంధకారం



మాట్లాడుతున్న ఎస్ఈబీ భీమిలి ఇన్‌స్పెక్టర్ చిన్నంనాయుడు

తగరపువలస : గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల భవిష్యత్ అంధకారమయం అవుతుందని ఎస్ఈబీ భీమిలి ఇన్‌స్పెక్టర్ చిన్నంనాయుడు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్ పండా, అధ్యాపకులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

నితీష్‌రెడ్డికి అభినందనలు



నగిరెడ్ల నితీష్ రెడ్డి

తగరపువలస : నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీ జీరుపాలేనికి చెందిన పదో తరగతి విద్యార్థి నగిరెడ్ల నితీష్ రెడ్డిని పలువురు అభినందించారు. ఇటీవల హర్యానాలోని రోహతక్‌లో నిర్వహించిన జూనియర్స్ విభాగంలో ఈ ఘనత సాధించాడు. అక్టోబరులో నేపాల్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ బాక్సింగ్ పోటీల్లో నితీష్‌రెడ్డి పాల్గొననున్నాడు. భీమిలి ప్రకృతి స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. ఈయన తండ్రి రాంబాబు ఝాన్సీ పట్టణంలో ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ సందర్భంగా తాత మాజీ సైనికుడైన కొల్లి రామానాయుడు మాట్లాడుతూ పదో తరగతి చదువుతూనే నేపాల్‌లో పాల్గొనే పోటీలకు నితీష్‌రెడ్డి శిక్షణ తీసుకుంటున్నాడని తెలిపారు.

తల్లిదండ్రుల అభిప్రాయాల సేకరణ

తగరపువలస : మన బడి - మన భవిష్యత్‌కై అందరం పాటుపడదామని జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనం, వసతులు, తాగునీరు, తదితర విషయాలపై అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నదానం

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట గ్రామదేవత కొత్తమ్మతల్లి ఆలయంలో మంగళవారం నుంచి అన్నదానం ప్రారంభించనున్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే అన్నదానానికి మొదటి రోజు రమా సప్లయర్స్ యజమాని తమ్మిన శ్రీను ఆర్థిక సాయం అందించారు.

చురుగ్గా మార్కెట్ నిర్మాణం

- గతంలో రూ.2.5 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- పెద్దవి 12, చిన్నవి 28 షాపుల నిర్మాణం



మార్కెట్‌కు ముందు వైపు నిర్మిస్తున్న షాపులు



మార్కెట్ లోపలి వైపు చేపలు, కూరగాయల విక్రయాలకు నిర్మిస్తున్న షాపులు

భీమునిపట్నం : భీమిలి ప్రజలకు అధునాతన మార్కెట్ అందుబాటులోకి రానుంది. 50 ఏళ్ల కిందటి పాత మార్కెట్ స్థానంలో కొత్తది నిర్మాణానికి రూ.2.50 కోట్లు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో భీమిలి పెద్దబజారు గంట స్తంభం పక్కన గతంలో వున్న పాత మార్కెట్ స్థానంలో కొత్త భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పనులు పూర్తయితే మరి కొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. 50 సంవత్సరాలకు పైనుంచి ఇక్కడ వున్న మార్కెట్ బాగా పాడైపోయి వినియోగానికి పనిరాకుండా పోయింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం అధునాతన సదుపాయాలతో కొత్త మార్కెట్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో ఏడు నెలల క్రితం కొత్త మార్కెట్‌కు అవసరమయ్యే భవనాల నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు.

వేలం ద్వారా షాపుల కేటాయింపు

ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో మార్కెట్ ముందు భాగంలో 12 పెద్ద షాపుల నిర్మాణం చేపట్టారు. వాటిని కిరాణా, ఫ్యాన్సీ వస్తువులతోపాటు ఇతర సామగ్రి విక్రయించే వారికి అద్దెలకు ఇస్తారు. ఆ షాపుల ముందు వాహనాల పార్కింగ్‌కు విశాలమైన స్థలాన్ని కేటాయించారు. అలాగే వెనుక వైపు కూరగాయలు, చేపలు, మాంసం విక్రయాలు చేసుకోవడానికి రైతుబజారు తరహాలో 28 చిన్న షాపులు నిర్మిస్తున్నారు. దీంతోపాటు మంచినీరు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు. ఈ షాపులన్నింటినీ వేలం ద్వారా కేటాయించనున్నారు. అలాగే మార్కెట్ చుట్టూ రక్షణగా



మార్కెట్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ గోడ

ఎత్తైన ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. ఈ పనులన్నీ ప్రస్తుతం చివరి దశలో వున్నాయి. కొద్ది రోజుల్లోనే మార్కెట్ అందుబాటులోకి రానుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంతటి చక్కని మార్కెట్ నిర్మాణం గత ప్రభుత్వం కేటాయించిన నిధులతో అందుబాటులోకి రానుండడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బొత్సను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ వాసురాజు, తదితరులు

తగరపువలస : స్థానిక సంస్థల కోటా ఉమ్మడి విశాఖ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను ఆ పార్టీ భీమిలి నాయకులు, ప్రజాప్రతినిధులు నగరంలోని నివాసంలో సోమవారం కలిశారు. భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, చెల్లూరి నగేష్, ఉండబట్ల చిన్నారావు, పల్లా సన్యాసిరావు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు కాద సూర్యనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, మేరుగు ఎల్లాజీ, సురపతి అప్పలరాజు, రాజగిరి రామచంద్రరావు కలిశారు. అనంతరం అక్కడే ఉన్న ఎమ్మెల్సీ పీవీ సురేష్‌ను కూడా నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బాటలతో చీడపీడల ఉధృతికి అడ్డుకట్ట



శింగనబందలో వరినాట్లపై అవగాహన కలిగిస్తున్న ఏవో శివకోమలి

తగరపువలస : వరినాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భీమిలి ఏవో బి.శివకోమలి సోమవారం శింగనబంద పంచాయతీలో రైతులు, వ్యవసాయ కూలీలకు సూచనలు చేశారు. నాట్లు పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉందన్నారు. నాటిన తర్వాత ప్రతీ 2 మీటర్లకు 30 సెంటీమీటర్లు బాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతిని అదుపు చేయవచ్చన్నారు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయడానికి, పైరు పరిస్థితి గమనించడానికి ఈ బాటలు ఉపయోగపడతాయన్నారు. వరి రకాల కాల పరిమితిని బట్టి చదరపు మీటరుకు కుదుళ్ల సంఖ్యను నిర్ధారించుకోవాలన్నారు. ఉడుపు సమయంలో నారు చివర్లను సమానంగా తుంచడం ద్వారా గుడ్డు దశలో ఉన్న ఆకుముడత పురుగు, కాండం తొలిచే పురుగును నివారించుకోవచ్చన్నారు. దీనివల్ల ప్రధాన పొలంలో 20 రోజుల వరకు పురుగుల తాకిడి ఉండదన్నారు. ఊద, ఏక వార్షిక గడ్డిజాతి మొక్కల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది హరీష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కుంటువాని చెరువు ఆక్రమణపై ఫిర్యాదు



ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న చంద్రరావు, రైతులు

పద్మనాభం : మండలంలోని అనంతవరం పంచాయతీ కుంటువాని చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ ఉప సర్పంచ్ గేదెల చంద్రరావుతోపాటు పలువురు రైతులు సోమవారం ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. విశాఖపట్నానికి చెందిన వ్యక్తి చెరువు గట్టు ఆక్రమించి రోడ్డు చదును చేస్తూ కల్వర్టుల నిర్మాణానికి పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. గతంలో దొంగతనంగా కల్వర్టు కట్టడానికి పైపు వేయగా అడ్డుకుని తొలగించామని తెలిపారు. మరలా ఇప్పుడు కల్వర్టు నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని ఆ ఫిర్యాదులో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన వ్యక్తి,, అనంతవరం సర్పంచ్ భర్త చెరువుకు సంబంధించిన కాలువను ఆక్రమించుకుని 80 సెంట్ల భూమి దోచుకున్నారని ఆరోపించారు. చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొండవాలు ప్రాంతాల పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న సీసీపీ సురేష్

మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2 పరిధిలోని కొండవాలు ప్రాంతాలు, గెడ్డలను జీవీఎంసీ సీసీపీ సురేష్ ఇతర అధికారులతో కలిసి సోమవారం మధ్యాహ్నం పరిశీలించారు. కొమ్మాది జంక్షన్ – శివశక్తినగర్ మధ్య కొండ వాలు ప్రాంతాల్లో ఉన్న నివాసాలు, అక్కడ ఉన్న వసతులు, స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. అత్యవసర సమయాల్లో చేపట్టాల్సిన చర్యలపై ఆరా తీశారు. అలాగే జీవీఎంసీ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే సహించవద్దని సూచించారు. జోన్ – 2 ఏసీపీ శభనాన్ శాస్త్రి, టీపీవో వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఈ – పంట నమోదు తప్పనిసరి



శిక్షణలో మాట్లాడుతున్న ఏవో ఎంవీఎస్ చలం

పద్మనాభం : రైతులందరూ వేసిన వరి పంటకు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వో ఈ – పంట వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఈ – పంట నమోదుపై గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఏ సర్వే నంబర్‌లో వరి పంట వేశారో ఆ నంబర్లను వీఆర్వోలు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అందజేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ పత్రాలు అందజేయాలని సూచించారు. ఈ పత్రాలు వల్ల కౌలు రైతులు బ్యాంకులో రుణాలు పొందవచ్చన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం ఈ – పంట నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యోగి, వీఆర్వోలు, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మధురవాడ పీహెచ్‌సీలో నీటి కష్టాలు

- నెల రోజులుగా సిబ్బంది, రోగులకు అవస్థలు



మధురవాడ పీహెచ్‌సీలో పనిచేయని బోరు

మధురవాడ : మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీరు లేక సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధురవాడ నడిబొడ్డున రోజూ వంద మందికిపైగా ఓపీ ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ అస్తవ్యస్థంగా ఉంది. నెల రోజుల కిందటే ఇక్కడి బోరు పాడైపోయి మూలకు చేరింది. దీంతో తాగునీరు మాట అటుంచితే కనీసం మరుగుదొడ్లకు కూడా నీరు లేదు. ఇక్కడ ఇద్దరు వైద్యులతోపాటు సుమారు 20 మంది సిబ్బంది రోజూ సేవలు అందిస్తున్నారు. పదుల సంఖ్యలో ఇక్కడికి వచ్చి వెళ్లే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఇతర సిబ్బంది ఉన్నారు. ఇక రాత్రి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా ఇక్కడ ఉంటారు. ఇక్కడ రోగులు, సందర్శకుల మాట అలా ఉంచితే రోజంతా సేవలు అందించే వారికి కూడా నీరు లేక ఇబ్బందులు తప్పడం లేదు. పైగా ఇక్కడ ప్రసూతి సేవలు కూడా అందిస్తున్నారు. ఇంత ముఖ్యమైన ఆస్పత్రిపై పాలకుల చిన్న చూపు కారణంగా ఇక్కడ ఏం జరుగుతుందో కనీసం ఎవ్వరూ ఆరా తీసే పరిస్థితి లేదు. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో స్థానిక సిబ్బంది నిర్వహణను గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై వైద్యాధికారి ప్రశాంతిని వివరణ కోరగా బోరు పాడైపోయి 20 రోజులు దాటిందని, ప్రత్యామ్నాయంగా జీవీఎంసీ ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నామని చెప్పారు. తక్షణమే బోరు మరమ్మతులు కూడా చేయిస్తామని తెలిపారు.

రోడ్లు లేక ఇబ్బందులు

కొమ్మాది : జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెం కాలనీల్లో పలు చోట్ల రోడ్లు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించమని స్థానిక కార్పొరేటర్‌కు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు లేకపోవడంతో వర్షాలు కురుస్తున్న సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. అధికారులు, నాయకులు తక్షణమే స్పందించి రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.



ఇదీ ప్రస్తుత దారి పరిస్థితి

తల్లిపాలతోనే బిడ్డలకు రోగనిరోధక శక్తి



ఆనందపురం కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కలిగిస్తున్న పీవో శ్రీదేవి



తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీలో సిబ్బంది



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యురాలు మానస లక్ష్మి

తగరపువలస : బిడ్డ రోగ నిరోధక శక్తికి తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ భీమిలి పీవో ఎం.శ్రీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆనందపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె తల్లులతో మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. లేదంటే రకరకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. 6 నెలలపాటు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లి పాలు ఇవ్వకపోవడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. పాల దిగుబడి కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అంజనీ దేవి, కార్యదర్శి రామకృష్ణ, సూపర్‌వైజర్ పి.వి.వి.రత్నం, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

- ఆదర్శనగర్ 1, 2 సచివాలయాల పరిధిలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఆశా వర్కర్ దేవి ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకతను వివరించి ర్యాలీ చేపట్టారు. డాక్టర్ భాస్కరరావు వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు.
- భీమిలి మండలం అన్నవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రేఖావాణి, కార్యకర్తలు ఎల్లయ్యమ్మ, వేణు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

మధురవాడ : పిల్లలకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని, వాటి ద్వారానే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి పి.మానస లక్ష్మి పేర్కొన్నారు. గణేష్‌నగర్‌లో తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలివ్వడం వల్ల ఆమెకు ఎంతో మంచిదన్నారు. తల్లి పాలు విషయంలో ఉన్న అపోహలు ఎవ్వరూ నమ్మవద్దన్నారు. 6 నెలల వరకు బిడ్డకు తల్లి పాలే ఇవ్వాలని సూచించారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, ఏఎన్ఎంలు కాసులమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దురాక్రమణలపై విచారణ జరిపించండి

తగరపువలస : ఆనందపురం మండలం ఆనందపురం, లొడగలవానిపాలెం పరిధిలోని సర్వే నంబర్ 276, 305, 306లో 150కు పైగా అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిపై విచారణ జరిపించాలని ఇరు గ్రామాల ప్రజలు సోమవారం తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. గతంలో వీఆర్వోలకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో గత తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. అనంతరం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించినా వీఆర్వో ఖాతరు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాలు కాపాడేందుకు అధికారులు విచారణ చేపట్టాలని ఇరు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

చికిత్సపై గ్రామీణ వైద్యులకు శిక్షణ



గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పిస్తున్న ఎస్వీ ఆస్పత్రి వైద్యురాలు

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురంలో గల వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం గ్రామీణ వైద్యులకు విజయనగరం ఎస్వీ ఆస్పత్రి వైద్యులు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు వైద్యం చేయడంపై జి.అనిల్ కుమార్, దంత వైద్యంపై టి.శిరీష, షుగర్, థైరాయిడ్, హార్మోనుల సమస్యలకు వైద్యం చేయడంపై ఎం.నవ్య శృతి శిక్షణ అందించారు. కార్యక్రమంలో మండల ఆర్ఎంపీల సంఘం అధ్యక్షుడు ఆర్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

‘టైమ్స్ ప్రో’తో ఐఐఎం ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఐఐఎంవీ, టైమ్స్‌ప్రో ప్రతినిధులు చంద్రశేఖర్, అనీష్‌శ్రీకృష్ణ

తగరపువలస : ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంవీలో సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా కేస్ కాన్ఫరెన్స్ నిర్వహణకు సోమవారం టైమ్స్‌ప్రోతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. జ్ఞాన మార్పిడి, లిబరేషన్, బాధ్యతాయుత నిర్వహణ, స్థిరత్వ రంగాల్లో ఆవిష్కరణకు ఇది దోహదపడుతుందని ఐఐఎం ప్రతినిధులు తెలిపారు. వినూత్న, స్థిరమైన సైన్స్ పద్ధతులపై చర్చించడానికి ఆలోచనాపరులు, విద్యావేత్తలు, పరిశ్రమ వర్గాలు, విద్యార్థులను ఒకచోట చేర్చే లక్ష్యంతో ఇది పని చేస్తుందన్నారు. టైమ్స్‌ప్రో సీఈవో అనీష్‌శ్రీకృష్ణతో ఐఐఎం డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

అధికారులు లక్ష్యాలు సాధించాలి



ఎంపీడీవో అప్పలనాయుడుతో ఎన్ఐఆర్‌డీ ప్రతినిధి నాగరాజు, తదితరులు

తగరపువలస : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్లాన్ థీమ్ లక్ష్యాలను సాధించేలా అధికారులు పని చేయాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి కె.నాగరాజు కోరారు. సోమవారం ఆయన మండలంలోని పెద్దిపాలెం గ్రామ పంచాయతీలో వివిధ అభివృద్ధి పనుల వివరాలు సేకరించి పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో అప్పలనాయుడును ఆయన కార్యాలయంలో కలిసి చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రామారావు, జేఈ బట్టు వెంకటేశ్వరరావు, ఎన్ఐఆర్‌డీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజేష్, పంచాయతీల కార్యదర్శులు సతీష్, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



అశోక్‌నగర్‌లో రోడ్డు మధ్యలో మూత లేని మ్యాన్‌హోల్

పీఎం పాలెం : స్థానిక అశోక్‌నగర్‌లోని అంతర రహదారిలో నిర్మించిన కల్వర్టుపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో ఆ రోడ్డులో ప్రయాణించే వారు తరచూ ప్రమాదాలకు గువుతున్నారు. ఎంతో ప్రమాదభరితంగా ఉన్న ఈ మ్యాన్‌హోల్‌పై కప్పు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి త్వరిత గతిన మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్లపై పశువులతో అవస్థలు



పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే 80 అడుగుల రోడ్డులో పశువులు

పీఎం పాలెం : ప్రధాన రహదారుల్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ఆ రోడ్లపై ప్రయాణించే వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదాలపైకి బాధ్యతారహితంగా పశువులను విడిచి పెడుతున్న యజమానులపై జీవీఎంసీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రహదారులపై సంచరిస్తున్న పశువులను అమావాస్యకో, పౌర్ణమికో గుర్తించి వాటిని వాహనంలో ఆరిలోవలో ఉన్న దొడ్డికి తరలిస్తున్నారు. తర్వాత వాటిని విడిపించుకునేందుకు వచ్చే యజమానులకు జీవీఎంసీ జరిమానా విధిస్తుంది. తర్వాత మళ్లీ మామూలుగానే రోడ్లపై అవే పశువులు సంచరిస్తుంటాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.